క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ యాగం



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం గ్రామం పూండ్ల వెంకురెడ్డి ఎస్టేట్లో శరన్నవరాత్రుల సందర్భంగా ఆదివారం అత్యంత వైభవంగా మహా చండీ యాగం నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఏర్పాట్లను వై.శివారెడ్డి పర్యవేక్షించారు.

- పట్టణంలోని శ్రీచాముండేశ్వరీదేవికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉభయకర్తలుగా కొండా సుబ్బారెడ్డి కుటుంబం వ్యవహరించింది.

సీహెచ్‌సీలో ప్రత్యేక వైద్యశిబిరం నేడు

పొదలకూరు: స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు మహిళలు, కిశోర బాలికలకు ప్రత్యేక వైద్యశిబిరం జరుగుతుందని ఆదివారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య నిపుణులు పాల్గొని అన్ని రకాల వ్యాధులకు పరీక్షలను నిర్వహిస్తారన్నారు. సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

కత్తితో బెదిరించి.. నగదు దోపిడీ

నెల్లూరు(క్రైమ్): కత్తితో చంపుతానంటూ ఆటో డ్రైవర్‌ను ఓ వ్యక్తి బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటనపై కేసును సంతపేట పోలీసులు ఆదివారం నమోదు చేశారు. వివరాలు.. రంగనాయకులపేటలోని ఉప్పరపాళేనికి చెందిన గోపీ తన ఆటోను ఉప్పరపాళెం సెంటర్ వద్ద శనివారం రాత్రి నిలిపి ఉండగా, రూ.వెయ్యిని ఇవ్వాలని అదే ప్రాంతానికి చెందిన సాయి డిమాండ్ చేశారు. తన వద్ద లేవని గోపీ చెప్పడంతో దాడి చేసి కత్తితో చంపుతామని బెదిరించి రూ.వెయ్యిని దోచుకెళ్లారు. విషయాన్ని బయటకు చెప్తే చంపుతామని బెదిరించారు. ఈ మేరకు సంతపేట పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు దర్యాప్తు చేస్తున్నారు.

వైన్ షాపులో చోరీ

నెల్లూరు(క్రైమ్): వైన్ షాపులో సీలింగ్ రేకులను తొలగించి క్యాష్ కౌంటర్‌లోని రూ.రెండు లక్షలను గుర్తుతెలియని దుండగుడు దోచుకెళ్లారు. వివరాలు.. సత్యనారాయణపురంలోని ఓ వైన్ షాపులో సీలింగ్‌కున్న జింక్ రేకులను గుర్తుతెలియని దుండగుడు ఆదివారం తెల్లవారుజామున తొలగించి లోపలికి ప్రవేశించారు. క్యాష్ కౌంటర్‌లోని రూ.రెండు లక్షలను దోచుకెళ్లారు. షాపును ఉదయం తెరిచి లోపలికెళ్లగా కింద రూ.500 నోటు పడి ఉండటాన్ని క్యాషియర్ ప్రదీప్ గుర్తించారు. క్యాష్ కౌంటర్‌లో నగదు కనిపించకపోవడంతో విషయాన్ని యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులకు ప్రదీప్ ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని చోరీ తీరును పరిశీలించారు. షాపులోని సీసీ పుటేజీల్లో లభ్యమైన దృశ్యాల ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నారు.

7న చలో విజయవాడ

నెల్లూరు(టౌన్): ఏకీకృత సర్వీస్ నిబంధనల సాధన, సమస్యల పరిష్కారం కోసం అక్టోబర్ 7వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ చిరంజీవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్ పిలుపునిచ్చారు. అన్నమయ్య సర్కిల్లోని యూటీఎఫ్ భవనంలో ఫ్యాప్టో సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. డివిజన్, జిల్లా స్థాయిలో సన్నాహక సమావేశాలను అక్టోబర్ 4, 5న నిర్వహించాలని సూచించారు. ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మధుసూదన్‌రావు, నేతలు జావీద్, మురళీకృష్ణ, ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, దశరథరాములు, శేషు, నరసింహరావు సురేంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని రజక వృత్తుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. నగరంలోని పూలే విగ్రహం వద్ద గల ప్రజా సంఘాల కార్యాలయంలో రజక వృత్తుల సంఘ రాష్ట్ర సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడారు. వివిధ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలవుతున్నా, దేన్నీ నెరవేర్చలేదని ఆరోపించారు. సామాజిక రక్షణ చట్టం విషయమై ఎనిమిది మంది మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసి, కాలయాపన చేస్తోందని విమర్శించారు. చట్టాల అమలుకు గానూ నవంబర్ 1, 2న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు, రేకులగుంట అంకయ్య, లింగాల నిర్మలమ్మ, బొజ్జ సుబ్బారావు, మడకరాజు, చిక్కవరపు వెంకటరెడ్డయ్య, రాయల మాలకొండయ్య, మంగమూరి శ్రీనివాసులు, నేరెళ్ల శ్రీనివాసరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్యుల కొరత

కూటమి ప్రభుత్వంలో పేదలకు వైద్యం సక్రమంగా అందడం లేదు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో బదిలీ అయిన వైద్యుల పోస్టులను భర్తీ చేసే విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కాలంగా కంటి విభాగం తలుపులు మూసి ఉన్నాయి. ఇచ్చిన కాంట్రాక్ట్ గడువు పూర్తి కావడంతో కంటి విభాగం పనిచేయడం లేదు.

- భర్తీ కాని గర్భకోశ వ్యాధి నిపుణుల పోస్టు
- ఇబ్బంది పడుతున్న మహిళలు
- ఏడాదిగా కంటి విభాగం మూసివేత
- నేత్ర పరీక్షల కోసం వృద్ధుల అగచాట్లు



పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం

పొదలకూరు : పొదలకూరు సీహెచ్‌సీకి చుట్టుపక్కల గ్రామాల నుంచి నిత్యం వందల మంది వచ్చి పరీక్షలు చేయించుకుంటారు. ముఖ్యంగా ప్రతి గురువారం గర్భిణులు స్కానింగ్ తీయించుకుని వెళ్తారు. అయితే గర్భకోశ వ్యాధి నిపుణులు లేకపోవడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోతున్న పరిస్థితి ఉంది. ఇక్కడ పనిచేస్తున్న గైనకాజిస్ట్ ఐదేళ్ల కాలం పూర్తి కావడంతో బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. గత ప్రభుత్వంలో ఐదేళ్ల తంచనుగా కంటి విభాగంలో వేలాది మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. ఇందుకోసం అపోలో హాస్పిటల్ వారికి కాంట్రాక్ట్ అప్పగించారు. ప్రస్తుతం ఆ సమయం పూర్తి కావడంతో వైద్యశాలలో కంటి విభాగాన్ని తాత్కాలికంగా మూసివేశారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

టెండర్లు నిర్వహిస్తేనే..

కంటి విభాగం తలుపులు తెరుచుకుని పేదలకు వైద్యం అందాలంటే ప్రభుత్వం టెండర్లను నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు అపోలో వారు కంటి అద్దాలు అందజేశారు. ప్రభుత్వం టెండర్లను నిర్వహించి తిరిగి కంటి విభాగాన్ని పునరుద్ధరించాలంటే సమయం పడుతుందంటున్నారు. దీనిపై స్పష్టత లేదు. ఈలోగా కంటి అద్దాలు అవసరమైన వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

రెండు నెలలుగా..


అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు చుట్టుపక్కల గ్రామాల్లో గర్భిణులను గుర్తించి వారికి నిర్దేశించిన సమయంలో వైద్య పరీక్షలను చేయిస్తుంటారు. సీహెచ్‌సీలో గతంలో గర్భకోశ వ్యాధుల నిపుణురాలు పద్మావతి వైద్యసేవలు అందించేవారు. నెలకొక పర్యాయం గర్భిణులకు స్కానింగ్ తీసి బిడ్డ ఎదుగుదలను వెల్లడించేవారు. అయితే ఆమె సాధారణ బదిలీల్లో వెళ్లడంతో రెండు నెలలుగా ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. స్కానింగ్ తీయాలంటే నిపుణులైన వైద్యులే ఉండాలి. ఈ నేపథ్యంలో మహిళా వైద్యులున్నా సాధారణ పరీక్షలను మాత్రమే నిర్వహిస్తారు. ఈ క్రమంలో గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తున్నట్టు తెలుస్తోంది. వెంటనే గైనకాలజిస్టు పోస్టును భర్తీ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

నివేదిక పంపాం



గర్భకోశ వ్యాధి నిపుణుల నియామకం కోసం ఉన్నతాధికారులకు నివేదికను పంపడం జరిగింది. ప్రస్తుతం ఇబ్బందులు తలెత్తకుండా సోమవారం ఇందుకూరుపేట నుంచి, శుక్రవారం వెంకటాచలం నుంచి గైనకాలజిస్టును ఇక్కడికి పంపేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. కంటి విభాగం ఏర్పాటుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

– డాక్టర్ యు.ప్రసాద్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పొదలకూరు



మూసేసిన కంటి విభాగం

ఉచిత యోగా శిక్షణ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని డీఎల్ఎన్నార్ పాఠశాలలో ఉచిత యోగా శిక్షణను పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగా శిక్షకుడు దినేష్‌కుమార్ మాట్లాడారు. అక్టోబర్ ఏడు వరకు రోజూ ఉదయం ఆరు నుంచి ఎనిమిది వరకు శిక్షణను నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ

పొదలకూరు: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆదివారం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. పట్టణంలోని ఆర్యవైశ్య నాయకుల ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి ఆర్యవైశ్య నాయకులు, సొసైటీ చైర్మన్ మస్తాన్‌బాబు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేమాలమ్మకు పొంగళ్లు

మనుబోలు: మండలంలోని అక్కంపేటలో గ్రామదేవత వేమాలమ్మకు గ్రామస్తులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ సర్పంచ్ నారపరెడ్డి జాంబవతమ్మ, మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నైవేద్యాలు సమర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామచంద్రారెడ్డి, శ్రీహరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ రూపం.. దేదీప్యమానం



పొదలకూరు : గజలక్ష్మి అలంకరణలో..



పొదలకూరు : మరుపూరులో మహాచండీదేవిగా..



మనుబోలు: మహాచండీ అలంకారంలో..

పొదలకూరు: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు జరిగాయి. రాచపూటి రామలింగయ్య ఉభయకర్తగా వ్యవహరించారు.

- మరుపూరు గ్రామంలో కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. ఉభయకర్తలుగా వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి – ప్రసూనమ్మ దంపతులు వ్యవహరించారు.
- పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో ఉన్న శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ధైర్యలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.
- మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో అవధూత ఆదిపరాశక్తి కాంతమ్మతల్లి ఆశ్రమంలో అమ్మవారు సరస్వతీదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు.
- మనుబోలు: మండలంలోని మనుబోలు కోదండరామపురంలో పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం మహాచండీ అలంకారణలో దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు పంచామృతాభిషేకం నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. ఉభయకర్తలుగా వేముల దిలీప్, గోపీకృష్ణ, శ్రీనివాసులు బ్రదర్స్ వ్యవహరించారు.
- బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు పుణ్యాహవచనం, కలశపూజలు, సామూహిక కుంకుమార్చన, మహా నవావరణ పూజను నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈఓ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.
- ఇందుకూరుపేట: గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పల్లకిసేవను వేడుకగా జరిపారు. పూజా కార్యక్రమాలను అర్చకులు అనిల్, రామకృష్ణ, కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా చలువాది సురేష్, లక్ష్మి, ధన్యాసి నాగరాజు, శశికళ, కొత్తకోట వెంకటేశ్వర్లు చంద్రిక దంపతులు వ్యహరించారు.



ఇందుకూరుపేట: కొమరికలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



ఇందుకూరుపేట: పల్లకిసేవలో చాముండేశ్వరీదేవి

పంట కాలువల్లోకి వ్యర్థ నీరు

ఇందుకూరుపేట : వ్యర్థ నీటిని పంట కాలువల్లోకి రొయ్యల కంపెనీలు వదలుతున్నాయని, దుర్గంధం వెదజల్లే ఈ రసాయనిక నీటితో స్థానికులు రోగాల పాలవుతున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వారితో కలిసి పంట కాలువలను ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రొయ్యల ప్రాసెసింగ్‌లో భాగంగా రసాయనాలు కలిగి ఉండే వ్యర్థ నీటిని ఫ్యాక్టరీల్లో శుద్ధి చేసి బయట నిల్వ ఉంచుకోవాల్సి ఉందని, అయితే అందుకు భిన్నంగా కాలువల్లోకి విడుదల చేస్తున్నారని చెప్పారు. కాలువల ద్వారా పంటలకు చేరి దెబ్బతింటున్నాయని ఆరోపించారు. పలుమార్లు తెలియజేసినా, యాజమాన్యాలు ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని, లేని పక్షంలో నిరసన చేపడతామని స్పష్టం చేశారు. వెంకటరమణారెడ్డి, సదాశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న నరేంద్రరెడ్డి తదితరులు

చెముడుగుంటలో కాకాణి పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం మండలంలోని చెముడుగుంట గ్రామంలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి ఆయనకు స్వాగతం పలికారు. కూటమి ప్రభుత్వంలో తమకు జరుగుతున్న అన్యాయాల గురించి ప్రజలు గోవర్ధన్‌రెడ్డికి చెప్పారు. అధైర్యపడొద్దని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయం చేసేలా చూస్తానని భరోసా ఇచ్చారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపల మన్మథ, జనార్దన రెడ్డి, బాలు వెంకటేశ్వర్లు నివాసాలకు వెళ్లి పరామర్శించారు.

నాగవరపమ్మ సేవలో ప్రసన్న



కోవూరు: గ్రామదేవత నాగవరపమ్మను మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. జెడ్పీటీసీ కవరగిరి శ్రీలత, పార్టీ యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి, రైతు విభాగ జిల్లా అధ్యక్షుడు నరసింహులురెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, కోవూరు మండల కన్వీనర్ అనూప్‌రెడ్డి, ఎస్టీ, లీగల్ సెల్ అధ్యక్షులు ప్రసాద్, చెంచురెడ్డి, ఆదినారాయణరెడ్డి, జగన్, కిశోర్, గయాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీల నియామకం



విడవలూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు మండలంలోని వరిణి, దండిగుంటలో పార్టీ గ్రామ కమిటీలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి మాట్లాడారు. గ్రామ స్థాయి నేతలు ప్రత్యేక చొరవ చూపి.. జగనన్న సైన్యాన్ని కమిటీలోకి తీసుకొని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచే కార్యకర్తలు, నేతలకు అండగా ఉంటామన్నారు.

ఉక్కపోతతో అల్లాడుతున్న జనం

పొదలకూరు: చాలాచోట్ల వర్షాలు కురుస్తున్నా పొదలకూరు పరిసర ప్రాంతాల్లో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. సెప్టెంబర్‌లోనూ వరుణ దేవుడు ముఖం చాటేశాడు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. తరచూ ఆకాశం మేఘావృతం అవుతున్నా వర్షం కురిసిన దాఖలాల్లేవు. రెండు రోజుల క్రితం వాతావరణ శాఖ వర్ష సూచన ప్రకటించింది. అయితే వాన కురవలేదు. రాత్రి వేళల్లో సైతం ఉక్కపోతతో జనం ఇబ్బంది పడుతున్నారు.

నేత్రదానం



భవాని (ఫైల్)

నెల్లూరు(అర్బన్): వెంకటాచలం మండలంలోని అనికేపల్లికి చెందిన భవాని (46) తన నివాసంలో ఆదివారం మృతి చెందారు. సీనియర్ న్యాయవాది మద్దులూరి బ్రహ్మం, పినాకినీ దేహ సమర్పణ సంస్థ అధ్యక్షురాలు విజయమ్మ సహకారంతో ఆమె నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ పెద్దాస్పత్రికి భర్త దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ సేకరించి కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99595 89321, 94415 83839 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

ఘనంగా జాషువా జయంతి



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నివాళులర్పిస్తున్న నేతలు



కోవూరులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలో గుర్రం జాషువా జయంతిని సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయుడు గండికోట సుధీర్ కుమార్, నేలనూతల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

- కోవూరు: గుర్రం జాషువా జయంతిని జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించారు. జేవీవీ కోవూరు యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు రహమతుల్లా, భాస్కర్, శ్రీశైల, వెంకయ్య, ఖాజావలీ, జయప్రకాశ్, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటి సందడి.. నేడు కరువై..

పొదలకూరు: మండలంలోని ప్రభగిరిపట్నం పంచాయతీలో నెలకొల్పిన షుగర్ ఫ్యాక్టరీ సుమారు పది మంది యాజమాన్యాల చేతులు మారి చివరికి లాకవుటైంది. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, అధికారులు ఎవరి దారి వారు చూసుకున్నారు. క్రషింగ్ జరిగే సమయంలో ఆ ప్రాంతం సందడిగా ఉండేది. ఫ్యాక్టరీ వెలుపల దుకాణాలు, హోటళ్లతో కళకళలాడేది. ఇప్పుడు ఆ పరిస్థితులేవ్వీ. గేటు మూసేసి ఉంది. విలువైన ఇనుప సామగ్రి, ఇతర వస్తువులను దొంగలు చోరీ చేశారు. ఫ్యాక్టరీ చుట్టుపక్కల అడవిని తలపిస్తోంది. తిరిగి ఫ్యాక్టరీ తెరుచుకుంటుందని తమకు ఉద్యోగాలు వస్తాయని కొందరు ఎదురు చూస్తున్నారు. లాక్‌అవుట్ సమయానికి చాలామందికి జీతాలు కూడా చెల్లించలేదు. దీంతో ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లి జీవిస్తున్నారు. ఫ్యాక్టరీ తెరుచుకుంటే పాత జీతాల బకాయిలు తమకు చెల్లిస్తారనే ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



షుగర్ ఫ్యాక్టరీ మెయిన్ గేట్